

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# వీధిలోకొచ్చి వేటాడి..

మల్కాజ్‌గిరి సిపి సుమతి నగరంలో అర్ధరాత్రి సంచలనం సృష్టించారు. మహిళల భద్రతను స్వయంగా పరీక్షించడానికి స్టింగ్ ఆపరేషన్ కోసం ఖాకీ డ్రెస్ తీసి.. సామాన్యురాలిగా దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాకు వచ్చారు. ఆమె సిపి అని తెలియక పోకిరీలు వెకిలి వేషాలు వేసిన 40 మంది రోమియోలకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. సినిమా రేంజ్‌లో ధైర్యాన్ని ప్రదర్శించిన సిపిపై ప్రశంసల జల్లు కురుస్తోంది.



## అర్ధరాత్రి మారువేషంలో సిపి సుమతి సీక్రెట్ ఆపరేషన్

- దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ వద్ద ఒంటరిగా సాహసం
- సామాన్య ప్రయాణికురాలి వేషధారణతో నిరీక్షణ
- అసభ్యకరంగా పోకిరీల వేధింపులు
- మూడున్నర గంటల పాటు భరించిన మహిళా అధికారిణి
- నైట్ బీట్ పోలీసుల జాడ కూడా లేక అసహనం
- తెల్లవారు జామున చేరుకున్న బీట్ కానిస్టేబుల్
- పోకిరీల తాట తీసిన లేడీ సింగం
- కామాంధుల్లో ఎక్కువ మంది విద్యార్థులే..
- 40 మంది అరెస్ట్
- తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా కౌన్సిలింగ్
- మృగాళ్ల తాట తీస్తానని వార్నింగ్
- పోలీసుల వైఫల్యంపైనా క్లాస్

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త :** నగరంలో మహిళల భద్రత కేవలం కాగితాలకే పరిమితమవుతోంది. అర్ధరాత్రి ఒంటరి మహిళ బయటకు వస్తే ఎదురయ్యే చేదు అనుభవాలు అన్నీ ఇన్నీ కాదు. ప్రధానంగా దిలుసుఖ్‌నగర్ ప్రాంతంలో మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో రోమియోలకు మాస్ షాక్ ఇచ్చేందుకు ఒక ఉన్నత స్థాయి పోలీస్ అధికారిణి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. తన హోదాను పక్కన పెట్టి, ఖాకీ దుస్తులు విడిచి, సామాన్య మహిళగా మారి రోడ్డుపైకి వచ్చారు. ఆమె ఎవరో కాదు.. మల్కాజ్‌గిరి సిపి సుమతి. తాజాగా మల్కాజిగిరి సిపి బాధ్యతలు స్వీకరించిన ఆమె.. ఆతర్వాతి రోజే అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి భద్రతా సిబ్బంది లేకుండా దిలుసుఖ్ నగర్ బస్టాండ్‌కు వద్దకు చేరుకున్నారు. దాదాపు మూడున్నర గంటల



సాధారణ మహిళగా సీక్రెట్ ఆపరేషన్ చేస్తున్న సిపితో ముచ్చట్లకు ప్రయత్నిస్తున్న ఆకతాయిలు

పాటు సాగిన ఈ సీక్రెట్ ఆపరేషన్‌లో సభ్యసమాజం తలదించుకునే నిజాలు బయటపడ్డాయి. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికురాలిలా నిల్చున్న ఆమె పోలీస్ కమిషనర్ అని తెలియని దాదాపు 40 మంది పోకిరీలు చుట్టుముట్టి వెర్రివేషాలు వేశారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ.. దారుణంగా వేధించారు. తెల్లవారుజామున 3.30 గంటల వరకు ఆమె ఆ నరకాన్ని మౌనంగా భరిస్తూనే అక్కడి పరిస్థితులను గమనించారు. ఈక్రమంలో పోలీసుల వైఫల్యం కూడా బట్టబయలైంది. మూడు గంటల పాటు ఆ పరిసరాల్లో ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా కనిపించలేదు. చివరకు తెల్లవారుజామున ఒక బీట్ కానిస్టేబుల్ అటువైపు వచ్చారు. వరుసగా మూడు రోజుల పాటు ఇదే తరహాలో నిఘా పెట్టిన సుమతి.. మొత్తం 40 మంది పోకిరీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా హాస్టల్స్‌లో ఉంటూ చదువుకునే విద్యార్థులే ఉండటం గమనార్హం. మద్యం, డ్రగ్స్ మత్తులో విద్యార్థులు దారి తప్పుతున్నారని, మహిళలు ఒంటరిగా కనిపిస్తే మృగాల్లా ప్రవర్తిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో సిపి సుమతి స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. చదువుకున్న వారు, బాధ్యతాయుతమైన ఉద్యోగాల్లో ఉన్నవారు ఇలాంటి నేరాలకు పాల్పడటం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పెట్రోలింగ్ సిబ్బందిపై కూడా ఆమె సీరియస్ అయ్యారు. నగరంలో మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఇకపై ఇలాంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని ఆమె హెచ్చరించారు.

**సామాన్యుల పరిస్థితి ఏంటి?..**

ఒక ఐపిఎస్ అధికారిణినే ఇంతలా వేధించారంటే, అత్యవసర పరిస్థితుల్లో అర్ధరాత్రి బయటకు వచ్చే సాధారణ మహిళల పరిస్థితి ఎంత భయానకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది. సిటీలో పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మృగాళ్లు ఏమాత్రం భయం లేకుండా తిరుగుతున్నారని ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైంది. నేరగాళ్ల ఆట కట్టించిన సుమతి సాహసం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఆమె చేసిన ఈ ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి

## కొడంగల్‌కు పండుగ శోభ తేవాలి

### పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశం
### సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

**కొడంగల్, మే 6 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా పండుగ వాతావరణం కనిపించేలా కొడంగల్ పట్టణాన్ని ముస్తాబు చేయాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుందరెడ్డి అధికారులకు సూచించారు. ఈనెల 8న ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటనలో భాగంగా బుధవారం పట్టణంలోని కడా కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వేదిక, సభ, పార్కింగ్ ప్రాంగణం పరిధిలో ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సౌండ్ సిస్టమ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. లైవ్ కవరేజ్ చేసే క్రమంలో డ్రోన్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్‌తో పాటు సమాచార పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు జగన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్ఇఇ రాములు, డిపీఆర్ఓ చెన్నమ్మ, మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్ సంభందిత అధికారులు పాల్గొన్నారు. కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు పరిశీలించారు. శ్రీవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈనెల 8న సిఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్న నేపథ్యంలో బుధవారం దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు, రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి.ముకుందరెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.



ఎర్రచందనాన్ని తరలిస్తున్న వాహనం(ఇన్‌సెట్) అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

### అనుమతి లేకుండా తరలిస్తున్న
## ఎర్రచందనం పట్టివేత

**మేడ్చల్, మే 6. ప్రభాతవార్త :** అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం కట్టెను మేడ్చల్‌లో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీహెచ్ఎంసీ మేడ్చల్ సర్కిల్ పూడూరు కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని కెఎల్ఆర్ వెంచర్ ఫేజ్ 2లో గల రోడ్డు నెంబర్ 8లో నుండి ట్రాక్టర్‌పై ఎర్రచందనాన్ని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో అటవీశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అటవీ శాఖ అధికారులు ఆ వాహనాన్ని ఎర్రచందనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్‌ను వివరణ కోరగా నరికిన ఎర్ర చందనం దుంగల కొలతలు తీసుకొన్న అనంతరం ఉన్నతాధికారులు నివేదిక అందించి దాని విలువ నిర్ధారిస్తామని పేర్కొన్నారు.



దుర్గా భవానీ మాత విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

## ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**మోమిన్‌పేట్, మే 6. ప్రభాతవార్త:** గ్రామాలలో ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని చిన్నకోల్కుంద గ్రామంలో శ్రీ దుర్గా భవాని మాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథగా పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత కొన్ని సంవత్సరాల నుండి అసంపూర్తిగా ఉన్న ఆలయాన్ని స్థానిక సర్పంచ్ బషెట్టి విశాల సంగమేశ్వర్ ఆద్వర్యంలో ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడంపట్ల సభాపతి వారిని అభినందించారు. శ్రీ దుర్గామాత కరుణ కటాక్షాలతోగ్రామ ప్రజలందరు సుఖ సంతోషాలతో తులతగాలని ఆయర ఆకాంక్షించారు. అలాగే గ్రామాలలో రాజకీయాలకతీతంగా దైవ కార్యక్రమాల్లోయ ప్రతి ఒక్కరు సమన్వయంతో సంఘటితంగా కృషిచేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తంగెడపల్లి పీఠాధిపతి శివయోగి శివాచార్య మహాస్వామి, మరియు ధనసిరి అప్పగారు, శీరేశ్వర శివాచార్య మహాస్వామి, జ్ఞానేశ్వరీమాత,లు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ మహెందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, ప్రవీణ్ కుమార్, గ్రామపెద్దలు, భక్తులు, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఆకస్మిక తనిఖీలు

### కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించిన కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 6, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు సంబంధించిన కొన్ని జిల్లా కార్యాలయాలను బుధవారం కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. వివిధ కార్యాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలించి వాటిని రికార్డు రూమ్‌లలో భద్రపరుచాలని సూచించారు. వివిధ శాఖల కార్యాలయాల పనితీరు, అధికారుల పాలన, సిబ్బంది, పెండింగ్ ఫైల్స్ పలు విషయాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్ఓ చంద్రావతి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు కొత్త సారథులు

- నియోజకవర్గంలో పార్టీ ప్రక్షాళన దిశగా అడుగులు
- అధిష్టానానికి చేరిన సిఫార్సుల జాబితా
- షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీధర్ ముదిరాజ్?
- కొత్తూరు మున్సిపాలిటీ నేతగా సుదర్శన్ గౌడ్
- ఆరు మండలాల్లోనూ కొత్త ముఖాలకు బాధ్యతలు
- మైనార్టీలకు, ఎస్టీలకు దక్కని చోటు?



**షాద్‌నగర్, మే 6, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత నూతన జవసత్వాలతో ముందుకు సాగేందుకు పార్టీలో ప్రక్షాళన మొదలైంది. కాంగ్రెస్ పార్టీ రాజకీయ భవిష్యత్తు తదితర శ్రేయస్సు దృశ్యా ఆయా మండలాలకు, పట్టణాలకు పార్టీ అధ్యక్షులను నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఫరుక్ నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడెం మండలాలకు అధ్యక్షులను నియమించేందుకు సమన్వయ కమిటీ రంగం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంతోపాటు కొత్తూరు మున్సిపాలిటీకి అధ్యక్షులను ఎంపిక చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గత కొన్ని రోజులుగా సమన్వయ కమిటీ పలు దఫాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితర పార్టీ సమన్వయ కమిటీ ముఖ్య నాయకులతో సమావేశాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పలు తర్జనభర్జనల అనంతరం పార్టీకి రథసారదులను ఎంపిక చేసి నివేదికను అధిష్టానానికి పంపించినట్లు తెలుస్తోంది. పాత మండలాల అధ్యక్షుల స్థానంలో పూర్తిగా కొత్తవారిని ఎంపికను సమన్వయ కమిటీ పూర్తి చేసింది. ఆరు మండలాలకు అందరూ కొత్త అధ్యక్షులు రాబోతున్నారు.

**అధిష్టానానికి చేరిన జాబితా ..**

అధిష్టానానికి కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కమిటీ పంపించిన నివేదిక ఆధారంగా మండలాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేసినట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు ఫరూక్ నగర్ మండలానికి రాయికల్ శ్రీనివాస్, కొత్తూరు మండలానికి సిద్దాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శేఖర్ రెడ్డి, అదేవిధంగా నందిగామ మండలానికి మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, కొందుర్గు మండలానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకుడు, పార్లమెంటరీ నియోజకవర్గ నేత కే పురుషోత్తం రెడ్డి, జిల్లేడు చౌదరిగుడా మండలానికి జాకారం సర్పంచ్ సీనియర్ నేత చంద్రశేఖర్, కేశంపేట మండలానికి రమేష్ లను ఎంపిక చేసి సమన్వయ కమిటీ అధిష్టానానికి నివేదిక పంపించినట్లు సమాచారం.

అలాగే షాద్‌నగర్ పట్టణానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నలమోని శ్రీధర్ ముదిరాజ్, కొత్తూరు మున్సిపాలిటీకి ఇదివరకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జయ సుదర్శన్ గౌడ్‌కు మళ్లీ రెండోసారి అవకాశం కల్పించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల పాత అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, సర్వేంద్రి గూడెం రాజు, వీరేశం, హరినాథ్ రెడ్డి, జంగా నరసింహా యాదవ్ అదేవిధంగా షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన కొంకల్ల చెన్నయ్యలకు సమన్వయ కమిటీ ఉద్వాసన పలికింది. అధికారికంగా త్వరలోనే వీరి పేర్లను ప్రకటించే అవకాశం ఉంది.

**నూతన జవసత్వాలకు కృషి**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల తర్వాత పార్టీ విషయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టి సారించారు. అధిష్టానం ఆదేశాల మేరకు నూతన అధ్యక్షులను ఎంపిక చేసే బాధ్యతను సమన్వయ కమిటీపై పెట్టారు. ఇలాంటి విమర్శలకు తావు లేకుండా కొత్తవారికి అవకాశ కల్పించేందుకు అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. పాతవారు ఎంతో కష్టపడి కాంగ్రెస్ పార్టీకి అధికారంలో రావడానికి తీవ్రంగా కృషిచేసి సఫలీకృతులయ్యారు.

ఇప్పుడు అధిష్టానం మరి కొంతమంది కొత్తవారికి అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించడంతో పాత అధ్యక్షులను తొలగించాల్సి వచ్చింది. సామాజిక సమీకరణాలను కూడా దృష్టిలో పెట్టుకొని సమన్వయ కమిటీ వ్యవహరించిందా? అన్నది మాత్రం ప్రస్తుతం కార్యకర్తలు ఆలోచిస్తున్న ప్రశ్న..? ఇద్దరు రెడ్డిలకు, ఒక ఎస్సీ, ఐదుగురు బీసీలకు ఈ పదవులు కట్టబెడుతున్నారని తెలుస్తోంది. మైనార్టీలకు, ఎస్టీలకు పార్టీ పదవుల్లో ఎక్కడ అవకాశం కల్పించలేదని సమాచారం.

## అనధికార క్లినిక్‌లు సీజ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 6, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కెపిహెచ్‌బి పరిధిలోని పలు క్లినిక్‌లలో బుధవారం డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి ఆకస్మిక తనిఖీలు చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న వావ్‌మెన్ స్కిన్, కాస్మెటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్‌ను, హెచ్‌సి హెయిర్ క్రియేషన్స్, డెర్మో360 కాస్మెటాలజీ, అమిస్టా కాస్మెటాలజీ క్లినిక్‌లు ఎటువంటి చట్టబద్దత రిజిస్ట్రేషన్ లేకుండా, అర్హత కల్గిన వైద్యులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నందున క్లినికల్ ఎస్టాబిలిష్‌మెంట్ చట్టం, అలో పతి చట్టం-2010 ప్రకారం వాటిని సీజ్ చేసినట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకర సేవలు అందిస్తున్నట్లు, అదనంగా పేషంట్ల నుంచి ప్యాకేజీల రూపంలో ముందుగానే అధిక మొత్తం వసూల్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ కేవలం రిజిస్ట్రేషన్ ఉండటం సరిపోదని, ప్రతి వైద్య సేవలు అర్హత కలిగిన వైద్యులచే చట్టబద్ద నిబంధనల ప్రకారం మాత్రమే అందించాలని, నిబంధనల ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆరోగ్యంతో చట్ట విరుద్దంగ ప్రవర్తించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, చట్ట రీత్య చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.



అక్రమంగా నడుస్తున్న హెయిర్ స్కిన్, డెర్మటాలజీ క్లినిక్‌లను సీజ్ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

## రాష్ట్రానికే ఆదర్శంగా శామీర్‌పేట సొసైటీ

**శామీర్‌పేట, మే 6, ప్రభాతవార్త :** శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం (సొసైటీ) పురోభివృద్దితో తెలంగాణలో ఆదర్శంగా నిలిచి ప్రత్యేక గుర్తింపును సాధించిందని, సహకార సంఘాలు రైతుల ఆస్థి అని, జిల్లాలోని పలు సంఘాలు కూడ అభివృద్దిలో రాణిస్తున్నట్లు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శామీర్‌పేట రైతుసేవా సహకార సంఘంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవం-సహకార భావం-రైతు బలం కార్యక్రమం డిసిఎంఎస్ వైస్‌చైర్మన్, ఈ సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాలోని 9 సహకార సంఘాల అభివృద్ధి కోసం రూ.8.5కోట్ల రూపాయలు తీసుకవచ్చి సంఘాల భవన సముదాయాల అభివృద్ధికి కృషి చేయటం జరిగిందన్నారు. సహకార సంఘాలు రైతుల ఆస్థి అని, సంఘాలలో రైతుల సౌకర్యం కోసం పలు నిర్మాణాలు చేపట్టటం జరిగిందన్నారు. రూ.5కోట్లతో పూడురులో ఉత్పత్తుల కోసం యూనిట్లను నెలకొల్పటం జరిగిందన్నారు. రైతులకు ఫలాలు అందించటానికి సహకార సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై రైతులకు

## నందిగామ పోలీసులపై విచారణ

### తప్పుడు కేసులతో వేధిస్తున్నారని బాధితుల ఫిర్యాదు
### డిసిపికి పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ నోటీసులు..

**షాద్‌నగర్, మే 6, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీసులపై వచ్చిన తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (హైదరాబాద్ రీజియన్) కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అథారిటీ చైర్మన్ కె. సుదర్శన్, సభ్యులు, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఈ నెల 15 లోగా నివేదిక సమర్పించాలని షాద్ నగర్ జోన్ డీసీపీని ఆదేశించారు. కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొంగర మహేష్, యదమ్మ, శేఖర్, వెంకటేష్‌లు తమపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధి స్తున్నారంటూ మార్చి 23న పోలీస్ కంప్లైంట్స్ అథారిటీని ఆశ్రయించారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ పి. ప్రసాద్, ఏఎస్ఐ కె. శ్రీనివాస్, ఎస్ఐ ఎం. గోపాలకృష్ణలు తమను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులపై తప్పుడు ఎఫ్ఐఆర్ (క్రైమ్ నెం. 112/2025) నమోదు చేయడం, ఫిర్యాదు తేదీలను తారుమారు చేయడం, ఫోర్జరీ సంతకాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయడమే గాకుండా బాధితుల నుండి ద్వారా లంచాలు వసూలు చేశారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో నిందితులకు కొమ్ముకాస్తూ ఆధారాలు సమర్పించినా కేసు నమోదు చేయకుండా కంప్లైంట్ చేసిన తమపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని బాధితులు వాపోయారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన అథారిటీ..క్రైమ్ నెం. 112/2025 రిజిస్ట్రేషన్ ఛార్జ్ షీట్ సమర్పించిన పరిస్థితులు..బాధితులు గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు..లంచం వసూలు, ఫోర్జరీ సంతకాలపై పోలీసుల పాత్ర వంటి అంశాలపై విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా వాస్తవాలతో కూడిన నివేదికను అందజేయాలని షాద్ నగర్ డీసీపీని అథారిటీ నోటీసులో స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల క్రిమినల్ మిస్ కండక్ట్ పై వచ్చే పిర్యాదులపై విచారణ జరిపేందుకు రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన పోలీస్ కంప్లైంట్స్ అథారిటీస్ ఏర్పాటైన సంగతి తెలిసిందే.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపి ఈటల

## మోడీ సభను విజయవంతం చేయండి

**ఘట్‌కేసర్ రూరల్, మే 6, ప్రభాతవార్త:** ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో భాగంగా నగరంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఎంపి నివాసంలో బుధవారం బిజెపి జిల్లా నాయకుల సమక్షంలో గోడ పత్రికను విడుదల చేశారు. ప్రధాని పాల్గొనే సభకు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌తో పాటు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గొంగళ్ల బాలేశ్ కురుమ, మేడ్చల్ నియోజక వర్గ ఇంచార్జీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పార్టీ జాతీయ నాయకులు బిక్కునాయక్, రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తదితరులు

## తుల్జా భవాని ఆలయానికి భూమి పూజ

**కడ్తాల్, మే 6, ప్రభతవార్త :** గిరిజన బంజారా సోదరులు సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా పిలుపునిచ్చారు. బుధవారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండాలో నిర్మిస్తున్న తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి తండా సర్పంచ్ సేవ్య నాయక్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం సేవాలాల్ మెరియా యాడి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాతను స్మరిచుకోవడంతో పాటు ఆయన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రంలో నాయకులు రాజు హేమ్లు, బద్య, సక్రు హరియా, జై, హరిచంద్, లక్ష్మణ్, పీర్య, పాండు, కిషన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం

**కుల్కచర్ల, మే, 6 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవు తుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని దాశ్యా నాయక్ తాండ గ్రామ పంచాయతీలో సవిత్రి బాయి, హరినాయక్‌కు ఇందిరమ్మ ఇంల్లు మంజురు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని బుధవారం గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ గృహప్రవేశాలకు స్థానిక సర్పంచ్ కవిత రాజుతో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, సినియర్ నాయకులు రాంచంద్రయ్య, యువ నాయకులు కమ్మరి స్వామి, వెంకటయ్య గౌడ్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య

## సహకార సంఘాలలో సభ్యత్వం తీసుకోండి

**కుల్కచర్ల, మే, 6 ప్రభాతవార్త:** ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు మేలు జరుగుతుందని పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య, సీఈఓ బక్క రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేధికలో సహకార సంఘాల బలోపేతం, రైతు ఐక్యత, అధునిక వ్యవసాయ పద్ధతులపై స్థానిక నాయకులతో, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులందరూ ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, డిసిసి జిల్లా పుపాధ్యక్షులు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, సినియర్ నాయకులు కృష్ణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే ఆదర్శంగా శామీర్‌పేట్ సొసైటీ

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన కల్పించాలని, స్కీమ్స్ వినియోగానికి కరపత్రాలను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని వాటిని పరిశీలించి అందరికి రుణమాఫీ జరిగేలా చూడాలని కమిషనర్‌కు సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు మార్కెటింట్, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు రాజుగా రాణించాలంటే అన్ని సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. శామీర్‌పేట సొసైటీకి, వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తీసుకరావాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు. సహకార సంఘాల పాలన విషయంలో కొంత ఆటంకం జరిగి మధ్యలో బ్రేక్ వచ్చిందని అన్నారు. తిరిగి బాధ్యతలు చేపట్టిన శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మదుకర్‌రెడ్డిని, వైస్‌చైర్మన్, డైరక్టర్లకు ఎమ్మెల్యే మల్లారెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర సహకార శాఖ స్పెషల్ కమిషనర్ పిఎస్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార సంఘాల బలోపేతంకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు వినూత్న కార్యక్రమాలు, పథకాలు అందించే దిశలో క్షేత్రస్థాయిలో పథకాలు అందేలా రైతు వారోత్సవాలు సహకార సంఘాల బలోపేతంకు కృషి జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఉన్న 980సహకార సంఘాలు ఉన్నట్లు బలోపేతంకు కృషి జరుగుతుందని రైతులకు ఉపయోగపడే విధంగ ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎఫ్‌పిఓ ఉన్న వాటికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలకు 2కోట్ల వరకు రుణాలు సబ్సిడీలతో ఇవ్వటం జరుగుతుందన్నారు. సొసైటీలు వాటా ధనం 15లక్షల రూపాయలు జమ చేస్తే కేంద్ర ప్రభుత్వం 15లక్షలు ఇచ్చి 30లక్షలతో అభివృద్ధి చేపట్టటానికి చేయూత నివ్వటం జరుగుతుందన్నారు. రైతులకు సేవలు అందించటానికి సహకార సంఘాలకు సౌకర్యాలు కల్పించటం, సేవలు పెంచటం జరుగుతుందన్నారు. రైతులకు ఆదాయం వచ్చేలా సహకార సంఘాల ద్వారా పలు పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. జిల్లాలో కొన్ని సొసైటీలలో రైతులకు రుణమాఫీ అందలేదని జిల్లా రైతు సమాఖ్య సంఘం అధ్యక్షులు ఎం.సంజీవరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకరాగ పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని కమిషనర్ రాహుల్‌రాజ్ అన్నారు.ఎఫ్‌పిఓ సభ్యత్వంతో ఉపయోగాలు పొందటానికి అవకాశం ఉందన్నారు. నగరానికి చేరువలో ఉన్నందున శామీర్‌పేట ప్రాంతంలో టూరిజం కోఆపరేటీవ్‌గా భావిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని సేవలు అందించే దిశగా ముందుకు వెళుతున్నట్లు కోఆపరేటీవ్ సంబంధిత అధికారి సురేఖ రాణి పేర్కొన్నారు. డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,స్థానిక సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ శామీర్‌పేట సొసైటీ ద్వారా రైతులకు సేవలు పెంచటానికి పలు సౌకర్యాలు కల్పించటం జరిగిందన్నారు. ఈ సహకార సంఘం ఆర్థికంగా రాణిస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపును సాధిస్తూ అన్ని సంఘాలకు మార్గదర్శకంగ మారిందన్నారు. అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవిలు మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సహకార సంఘాల అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ వి.నాగలింగాచారి, కెనరా బ్యాంకు లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్, డిసిఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ వంగ పెంటారెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్లు వంగ భూమిరెడ్డి, ఎం.ప్రతాప్‌రెడ్డి, కె.నరేందర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కె.బిక్షపతి, డి.బాబుసింగ్, ఎల్.నర్సింలుగౌడ్, సిఇఓ రవి,మండల ఎఓ రమేశ్, హెచ్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

### అవినీతికి తావులేకుండా

# సొసైటీ బలోపేతం

- రైతులకు సులభంగా రుణ సౌకర్యం
- ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

**పెద్దేముల్, మే 6, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా అందరు కలిసికట్టుగా సొసైటి అభివృద్ధి పనిచేయాలని ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్‌గా ఆయన పాలకవర్గంతో కలిసి రెండోసారి భాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సొసైటి పాలకవర్గ పదవి బాధ్యతలను పొడిగించిన ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు రుణాలను సులభంగా అందించే విధంగా కృషిచేస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలను పూర్తిగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సభ్యుల సమస్యలకు ప్రాధాన్యంగా తీసుకొని వెంటనే వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని అన్నారు. అవినీతికి తావులేకుండా నిష్పక్షపాతంగా పనిచేసి సొసైటిని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని అన్నారు. పదవి భాధ్యతలు స్వీకరించిన ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డిని బిఆర్ఎస్ నాయకులు సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి సి.రంగయ్య, మాజీ యంపిటిసి విద్యాసాగర్, సీనియర్ నాయకులు నరేష్‌రెడ్డి, శిల్లి, మేనేజర్ మురళిగౌడ్, డైరెక్టర్ గోపాల్, రవికిరణ్, సొసైటి సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు.



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## విభేదాలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలి

### కాంగ్రెస్ నూతన కమిటికీ ఎమ్మెల్యే బుయ్యని హితవు

**పెద్దేముల్, మే 6, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంలో ముందుండాలని పెద్దేముల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన రుద్రారం పి.మహిపాల్‌రెడ్డికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా పి.మహిపాల్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపగా, ఎమ్మెల్యే కూడా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో చురుకుదనంగా పని చేయాలని సూచించారు. విభేధాలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి అంబాసిడర్‌గా పనిచేసే విధంగా మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పార్టీ లోపలి ఐక్యత అత్యంత ముఖ్యమని సూచించారు. కష్టకాలంలో కూడా పార్టీని నిలబెట్టె నాయకత్వం అలవర్చుకోవాలని అన్నారు.



మహిపాల్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే

రాబోయే ఎన్నికలలో కలిసి కట్టుగా కాంగ్రెస్ విజయానికి కృషిచేసి ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఎమ్మె ల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అం జయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ మురళిగౌడ్, మాజీ ఉపా ధ్యాక్షులు జితేందర్‌రెడ్డి, సొసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, నాయకులు కోటపల్లి బం దెన్న, చిత్రశేఖర్, బుద్దారం మాజీ సర్పంచ్ వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నాడు రైతులను ముంచి నేడు మొసలి కన్నీరా!

### బిఆర్ఎస్ హయాంలో ఎనిమిది వేల మంది రైతుల ఆత్మహత్యలు

### ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి

**షాద్‌నగర్, మే 6, ప్రభాతవార్త :** వరి వేస్తే ఉరే అంటూ ఆనాడు రైతులను వంచించారు.. వేలాది మంది రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యారు.. ఈరోజు రైతుల కోసం 24 గంటలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడతారా..? కాంగ్రెస్ పని తీరుపైనే మాట్లాడతారా..? డ్రగ్ డాన్ కెటీఆర్.. ఖబర్దార్.. అంటూ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ వ్యాఖ్యలలను నిరసిస్తూ సీఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, విప్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో అసలు రైతుల కోసం చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు. 2017లో ఖమ్మం జిల్లాలో వ్యవసాయ మార్కెట్లో రైతులు మిర్చికి మద్దతు ధర కోసం ఆందోళన చేస్తే వారిని జైలు పాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. యాసంగిలో వరి మీద ఆధారపడే రైతులకు మద్దతుగా ఉండాల్సింది పోయి వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే అంటూ భయపెట్టిన చరిత్ర కేసీఆర్‌దని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే వ్యవసాయం సక్రమంగా సాగక, అప్పుల పాలై 6 నుంచి 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిందని ఆరోపించారు. రైతుల కోసం నిరంతరం సేవలు అందిస్తూ అన్ని విధాల ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోలికి వస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా కేటీఆర్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి

## మోడీ అభివృద్ధిని వెంట తీసుకొస్తున్నారు

**షాద్‌నగర్, మే 6, ప్రభాతవార్త :** తెలంగాణలో బిజెపికి అధికారమే లక్ష్యంగా ముందడుగు వేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ వికాసమే లక్ష్యంగా పనిచేస్తాం అని బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో పార్టీ ఇన్చార్జి అందె బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు పతంగి రాజా భూపాల్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు వస్తున్న మోడీ సభను విజయవంతం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మోడీ సభకు అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనం హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ప్రధాని మోడీ తెలంగాణకు అభివృద్ధిని వెంట తీసుకొస్తున్నారని గుజ్జల ప్రేమేందర్ రెడ్డి వెల్లడించారు. వికసిత తెలంగాణ లక్ష్యంగా ఆయన ఇక్కడికి వస్తున్నారన్నారు. ఇప్పటికి 15 లక్షల కోట్ల రూపా యలను అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్‌లో పునరుద్ధరణ, రైతులకు నిధులు, మెడికల్ కళాశాల అభివృద్ధి వంటివి జరిగాయని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి, పునర్విభజనను అడ్డుకున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పి బిజెపి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్, నేతలు అందే బాబయ్య, శ్రీ వర్ధన్ రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మోడీ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి తదితరులు

## ప్రతాప్‌రెడ్డికి ఈసారీ నిరాశేనా?

- షాద్‌నగర్‌లో కీలక నేతగా మాజీ ఎమ్మెల్యే
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వయంగా ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్
- రాజకీయ భవిష్యత్తుకు హామీ
- నామినేటెడ్ పదవిపై ఆశలు పెట్టుకున్న ప్రతాప్‌రెడ్డి అభిమానులు
- తాజాగా ప్రకటించిన 17 కార్పొరేషన్లలో దక్కని చోటు
- నిర్లక్ష్యం చేస్తే పార్టీకి చేటని కార్యకర్తల ఆవేదన

**షాద్‌నగర్, మే 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పండగ షురూ అయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలు దఫాలుగా కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా పలు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తోంది. మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు, 11 వైస్ చైర్మన్లను ప్రకటించారు. అయితే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డికి మాత్రం ఈసారి కూడా నిరాశే ఎదురైంది. సర్పంచ్ ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో తనదైన రాజకీయ మార్క్ ప్రదర్శించిన ప్రతాప్‌రెడ్డికి నామినేటెడ్ పదవి కట్టబెట్టే విషయంలో తీవ్ర అన్యాయమే జరుగుతుందని ఆయన అభిమానులు మండిపడుతున్నారు. రాజకీయ అనుభవంతోపాటు కాంగ్రెస్ పార్టీ విజయానికి మనుగడకు ఆయన సేవలు నిరంతరం అవసరం ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శంషాబాద్ లోని ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రాజకీయ భవిష్యత్తు గురించి ప్రస్ఫుటమైన హామీని కూడా ఇచ్చారు. కీలకమైన కార్పొరేషన్ పదవీ యోగం ఉంటుందని చెప్పారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిపోయిన ఇప్పటివరకు ఏ అవకాశమూ రాకపోవడం పట్ల ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌లకు సిఫార్సు చేశారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డితోపాటు పలువురు సీనియర్ నేతలు వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇకనైనా ప్రతాప్ రెడ్డి విషయంలో సీరియస్‌గా దృష్టి సారించకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లక తప్పదని ఆయన అభిమానులు భావిస్తున్నారు.



## దివ్యాంగునికి వీల్‌చెయిర్ బహూకరణ

**జవహర్‌నగర్, మే 6. ప్రభాతవార్త :** జవహర్‌నగర్ గబ్బిలాలపేటలో నిరుపేద దివ్యాంగుడైన శివ కుమార్‌కు తన జన్మదినాన్ని పురస్కరించుకుని పంబోజు సాయి కృష్ణ చారి వీల్‌చెయిర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి నాయకుడు మెరుగు శివకృష్ణతోపాటు సాయి కృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దివ్యాంగుల సమస్యలపై పెద్ద మనసు చూపిన సాయి కృష్ణను పలువురు అభినందించారు.





గంధోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు

## దర్గాలో వైభవంగా గంధోత్సవం

**నందిగామ, మే 6, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉన్న దర్గాలో బుధవారం ముస్లిం మతపెద్దలు గంధోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ, వార్డ్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు టైలర్ కృష్ణ, కిట్టు, సయ్యద్ సర్ఫుల హుస్సేహ్నా, ఇన్యత్‌అలీ టర్బీ, జావేద్ ఇంతియాజ్, ఖాజా ఇంతియాజ్, ఇక్బాల్ ఇంతియాజ్, షేక్ నసీం తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడలో నిరసన తెలుపుతున్న సిపిఐ నేతలు

## పెంచిన సిలిండర్ ధరలను తగ్గించాలి

**ఘట్‌కేసర్ రూరల్, మే 6, ప్రభాతవార్త:** పెంచిన వాణిజ్య గ్యాస్‌సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని కోరుతూ పోచారం డివిజన్ అన్నోజిగూడలో సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. అన్నోజిగూడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ మాట్లాడుతూ వాణిజ్య సిలిండర్ ధర రెండు నుండి మూడువేలకు పైగా పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో గృహ అవసరాల సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచే నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎఫ్ మండల కార్యదర్శి సదాశివ, సిపిఐ నాయకులు మురళీ, సయ్యద్ సాలార్, బి.పాండు ఎన్.రాములు, వెంకటేశ్, నర్సింహ పాల్గొన్నారు.



ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్న కారు

## రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

**నందిగామ, మే 6, ప్రభాతవార్త :** నందిగామ మండలం 44 వ బైపాస్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలలోకి వెళితే.. నయారా పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న కాంటైనర్ లారిని హైదరాబాద్ నుండి మహబూబ్‌నగర్ వైపు కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు.



పెళ్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

## అడపడచు పెళ్లికి కానుక

**కుల్కచర్ల, మే, 6 ప్రభాతవార్త:** ప్రతి పేదింటి అడబిడ్డ పెళ్లికి అండగా ఉంటామని సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ భరోసా ఇచ్చారు. బుధవారం మండల పరిధిలోని బండమిది తండా గ్రామ పంచాయతీలో సభవత్ సక్రి టిక్య కుమార్తె వివాహనికి సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ తన సొంత డబ్బుతో 50కిలోల సోన బియ్యం, 15 కేజిల వంట నూనెతోపాటు వెయ్య రూపాయిలు నగదు కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ సంఘ్‌ను పటిష్టం చేయాలి

**కంటోన్మెంట్,మే 6 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వేలో వివిధ బ్రాంచ్‌లలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులు,కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ సంఘ్ ముందుంటుందని, అందు వల్ల ఎంప్లాయిస్ సంఘ్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఉద్యోగులు, కార్మికులు పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదం సంతోష్ కుమార్ తెలిపారు. రెజిమెంటల్ బజార్‌లోని సిగ్మాన్ హోటల్‌లో నిర్వహించిన 141వ డివిజనల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL CUM IX AMM MALKAJGIRI DISTRICT. AT: MEDCHAL
O.S.NO. 267 OF 2026
Between:
Bandamidi Santhoshi & 2 Others ...Plaintiffs
And
The Tahsildar, Medchal & another ...Defendants
NOTICE
To,
All Concerned
Please take notice that my clients by names 1) Bandamidi Santhoshi W/o. Late Bandamidi Satyanarayana, aged about 40 years, Occ: Household, 2) Bandamidi Bhargav Raja S/o. Late Bandamidi Satyanarayana, aged about 25 years, Occ: Student and 3) Bandamidi Navya D/o. Late Bandamidi Satyanarayana, aged about 23 years, Occ: Student, All are R/o. H. No 14-117/2, Kistapur village, Medchal Mandal, Medchal Malkajgiri District., filed suit for Declaration to declare them are only legal heirs of deceased Bandamidi Satyanarayana against concerned before Hon'ble II Addl. Junior civil Judge, Medchal the above suit is posted to 17-06-2026 for your appearance. Hence the above named and All Concerned are hereby directed to appear personally or through Authorized representative or through Advocate appointed by you on the said date i.e., 17-06-2026 at 10.30 AM before the Hon'ble Court without fail, otherwise the matter will be decided as per law.
//By Order of the Court//
Sd/- SYED ZIAUDDIN TOUSIF
Advocate
#H.No.5-205, Near Tahsildar Office, Medchal Municipality, Medchal Mandal, Medchal District.
Ph: 99082 65099

## డిజిపిని సత్కరించిన కిలారు


సీవీ ఆనంద్‌ను కలిసిన కిలారు రాజేశ్వరరావు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ మాజీ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు సత్కరించారు. డీజీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వ కంగా కలిసిన కిలారు శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో అనేక సేవలందించిన సీవీ ఆనంద్ డీజీపీగా మరింత వన్నె తీసుకురావాలని కోరారు. తెలంగాణ పోలీ సులకు ఉన్న పేరును మరింత ముందుకు తీసుకెళ్లాలని, విప్లవా త్మకమైన మార్పులతో తనదైన ముద్ర వేసుకోవాలని కోరారు.

## ధన్వంతరి ఫౌండేషన్ భూములను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలి : గిరిప్రసాద్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్‌నేషనల్ సంస్థపై నాంపల్లి ఎంఎస్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆ సంస్థ ఆస్తులను వేలం వేసి, వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు చెల్లించాలని తీర్పు ఇచ్చిందని బాధితుల హక్కుల పరిరక్షణ ట్రస్ట్ తెలిపింది. ఆ సంస్థ చైర్మన్ కమలాకర్‌శర్మ, జయశ్రీ, ఇతర మహిళా డైరెక్టర్లు దాఖలు చేసిన స్టే పిటిషన్‌లను హైకోర్టు కొట్టివేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫౌండేషన్ భూముల వేలంపై స్పష్టత ఇవ్వడం లేదని ట్రస్ట్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. భూలావాదేవిల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీరంగ అన్నపూర్ణశర్మ, లక్ష్మణ్‌లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకపోవడం వెనుక ఉన్న అసలు సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆ ఇరువురిని తక్షణమే అరెస్టు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. సత్య జారి, డాక్టర్ జయశ్రీలకు మంజూరు చేసిన బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని, వారు గనుక బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, దీంతో న్యాయం అలస్యంగా వస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కమలాకరశర్మ, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ కో-కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## శిల్పకళావేదికలో నాదపరంపర సంగీత మహోత్సవం

### 150మంది కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింపనీ

నాంపల్లి, మే 6 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక వేదిక అరభి ది సెంటర్ ఫర్ ఫర్పార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 9 శనివారం సాయంత్రం 5గంటల నుండి శిల్పకళావేదికలో నాదపరంపర శీర్షికన సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత, ప్రముఖ సంగీత విద్వాంసుడు కళారత్న డా. అశోక్ గుర్జాలే పత్రికా ప్రకటనలో తెలిపారు. సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకల్లోల భాగంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో సంగీతప్రియులను అబ్బురపరిచేలా 150మంది ప్రముఖ కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింఫని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల నుండి యువకళాకారుల వరకు పాల్గొనే ఈ విలక్షణ సంగీత ప్రదర్శన భారతీయ శాస్త్రీయ సంగీత వైభవాన్ని పరిమళింపజేస్తుందని అన్నారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు, డా. దీపికారెడ్డి, దారూరి రాఘవాచారి, రాంకుమార్ మోహన్, జి.కిషన్‌రావు, తనికెళ్ళభరణి, డా. జె.అనురాధ, జి.అనురాధరెడ్డి, కళ్యాణి ద్విభాష్యం తదితరులు పాల్గొంటారని వివరించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు పాలకుర్తి రామచంద్రశర్మను మృదంగ విభూషణ్ బిరుదుతో సత్కరించనున్నట్లు డా. అశోక్ గుర్జాలే పేర్కొన్నారు.

## 8న ప్రపంచ తలసీమియా దినోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి, మే 6 ప్రభాతవార్త : ప్రతీ సంవత్సరం ఎంతో మంది తలసీమియా వ్యాధి బారిన పడుతున్నారు. దేశంలో రోజు, రోజుకు తలసీమియా రోగుల సంఖ్య పెరుగుతున్నది. తలసీమియా వ్యాధి నిర్ధారణ అయితే రోగికిబ్రతికి ఉన్నంత కాలం నెలలో రెండు సార్లు రక్తం ఎక్కించవలసి ఉంటుంది. అదే విధంగా క్రమం తప్పకుండ మందు వాడాలి. తలసీమియా రక్తానికి సంబంధించిన ఆవలక్షణం. దీనివల్ల శరీరంలో కావలసినంత రక్తం తయారు కాదు. తలసీమియా వల్ల ఎర్ర రక్త కణాల జీవిత కాలం తగ్గిపోతుంది. హెచ్‌బి ఎలక్ట్రోపోరోసిస్ పరీక్షతో తలసీమియా వ్యాధిని నిర్ధారించవచ్చును, తలసీమియా రోగికి రక్తం ఎక్కించక ముందు హెచ్‌బి స్థాయి తొమ్మిది జీఎం కన్న తక్కువ ఉండ కూడదు. అదే విధంగా రక్తం ఎక్కించిన తర్వాత 12 జీఎం శాతం స్థాయి వద్ద నిలకడగా ఉండాలి. తలసీమియా ఉన్న వారికి మాంసకృతులు, కేలరీలు అధికంగా, ఐరన్ తక్కువగాను ఉన్న ఆహారం ఇవ్వాలి. వైద్య సలహాలు పాటించి మందులు వాడితే తలసీమియా మేజర్‌లు అందరిలా సామాన్య జీవితం గడప వచ్చును. కాగా రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న తలసీమియా అండ్ సికిల్ సెల్ ఆధ్వర్యంలో తలసీమియా రోగలకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిగి మందులు పంపిణీ చేస్తున్నారు. రోగికి కావలసిన బ్లడ్‌ను ఉచితంగా ఎక్కిస్తున్నారు. తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలో ఇంత వరకు దాదాపు 4500 మంది రోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా ఈ నెల ఎనిమిదివ తేదీన జరగనున్న ప్రపంచ తలసీమియా వ్యాధి దినోత్సవం సందర్భంగా మోటార్ బైక్ ర్యాలీ తో తలసీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సొసైటీ అధ్యక్షులు చంద్రకాంత్ అగర్వాల్ వెల్లడించారు. తలసీమియా బాధితుల మనోధైర్యాన్ని పెంచటం వ్యాధినివారణపై అవగాహన కల్పించటం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు.

## కేశవగిరిపై నేత్రపర్వంగా లక్ష్మీచెన్నకేశవుల కల్యాణం



చాంద్రాయణగుట్ట, మే 6, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం లక్ష్మీచెన్నకేశవుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యుల పర్యవేక్షణలో అర్చకస్వాములు కంజర్ల ప్రణయ్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో దమ్మాయగూడ రాజశేఖర్, మీనాకుమారి దంపతులు స్వామి వార్ల కల్యాణాన్ని జరిపించారు. అర్చకస్వాముల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారు అమ్మవారి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకున్నారు. చూడ ముచ్చటైన కల్యాణాన్ని తిలకించేందుకు సమీప బస్తీల భక్తులు హాజరైయ్యారు. అంతకుముందు ఆలయంలో కొలువైన స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు లక్ష్మీచెన్నకేశవులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కన్నులపండువగా శ్రీనివాసుడి కల్యాణం


బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వేదపండితులు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కలియుగప్రత్యక్షదైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం బుధవారం ఆలయం వ్యవస్థాపక వంశీయులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ వి.అంబుజ సమక్షంలో రమణీయంగా సాగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, బాలభోగము, బలిహరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రబంధపారాయణం, మహానివేదన, హవనం, హారతి, మంత్రపుష్పం జరిగింది. కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందుగా ఎదురుకోళ్ళు, అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన అలివేలుమంగా సమేత ఈ ఉత్సవాన్ని పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ సతీమణి జి.సువర్ణలత, కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్-జి.కీర్తి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు గరుధవాహనసేవ

కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుధవాహనసేవ ఉంటుందని ఆలయం అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ అంబుజ వివరించారు. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, హవనము, బలిహరణం, బాలభోగము, మంత్రపుష్పము, పల్లకీసేవ, మహానివేదన, వేదపారాయణాలు, ద్రావిడ ప్రబంధము ఉంటుంది. సాయంత్రం జరిగే వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంటితుడుపుగా కెమేరాలు.. భద్రతకు తిప్పలు!

-పనిచేయని సీసీ కెమెరాలు.. పట్టించుకోని పోలీసులు

-చీకటి పడితే జనం బేజారు.. చిక్కడపల్లి పరిధిలోని కాలనీల దీనస్థితి

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త : నేరాల నియంత్రణలోనూ, నిందితులను పట్టుకోవడంలోనూ సీసీ కెమెరాలు అత్యంత కీలకం. కానీ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కెమెరాలు నేడు మూలపడ్డాయి. ఫలితంగా స్థానిక ప్రజలు భద్రత లేక భయం భయంగా గడుపుతున్నారు. ప్రధానంగా అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, బృందావన్ కాలనీ, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గతంలో భారీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఆర్భాటం చేసిన పోలీసులు, ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ కెమెరాలు మొరాయించి ఉన్నా, వాటిని బాగు చేసే నాథుడే కరువయ్యారు. ప్రజలకు చేరువగా ఉంటూ భద్రత కల్పిస్తామన్న ఫ్రెండ్లీ పోలీసింగ్ మాట ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు. కెమెరాలు పనిచేయకపోవడంతో గొలుసు దొంగతనాలు, వాహనాల చోరీల భయం కాలనీ వాసులను వెంటాడుతోంది. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ఆధారాల కోసం వెతకాల్సిందే తప్ప, నిఘా నేత్రాల ద్వారా నిందితులను పట్టుకునే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు.

కాగా కాలనీలో కెమెరాలు ఉండి కూడా లేనట్టే. రెండేళ్లుగా అవి పనిచేయడం లేదని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా చిక్కడపల్లి పోలీసులు స్పందించి కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

-కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందనకు వినతి


సెక్రటరీ హరిచందనకు వినతిపత్రం ఇస్తున్న చిరంజీవులు, రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: కుకింగ్ గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు, కమిటీ నాయకులు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శులు అజయ్ రెడ్డి, నగేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు సెక్రటేరియట్‌లో ఎల్.పీ.జీ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు హరిచందన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ .టి చిరంజీవులు మాట్లాడుతూ ఎల్.పీ.జీ డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ ఎస్ఐ, పిఎఫ్ లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖనియమాలను పాటించ కుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడెంటిటీ కార్డులు అపాయింట్మెంట్ లెటర్ కూడా ఇవ్వడం లేదని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖలను నియమాలను పాటించకుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు వివిధమైన ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి హరి చందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలి

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చికోటి ప్రవీణ్

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూ ధర్మరక్ష వ్యవస్థాపకులు డాక్టర్ చికోటి ప్రవీణ్ డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ జై శ్రీరాం అనే పవిత్ర నినాదాన్ని డబ్బుతో పోల్చడం హిందూ ధర్మంపై దాడి అని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి దైవ విశ్వాసాలను అవమానించడం దురదృష్టకరమన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను ఆమె దెబ్బతీశారని, దీనికి కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. దైవాన్ని అవమానించిన వారికి ప్రజలు తప్పనిసరిగా గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.2 లక్షల 5 వేల 395


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వివేక్ నగర్ ఆంజనేయస్వామిదేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజు లకు గాను రూ. 2 లక్షల 5 వేల 395 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంక టాద్రి భక్తులు పాల్గొన్నారు.

## మద్యం వ్యసనంతో ప్లంబర్ మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం వ్యసనంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. అడ్డేపు అనిల్ కుమార్ (38) అనే వ్యక్తి వృత్తిరీత్యా ప్లంబర్‌గా పనిచేస్తూ, శ్రీరామ్ నగర్ కాలనీ, చింతల్‌లో తన అక్క ఇంట్లో నివసిస్తున్నాడు. ఇతని స్వగ్రామం వరంగల్ జిల్లా, కనిమాబాద్ మండలం ఎస్.ఆర్ తోట గ్రామం. స్థానికంగా ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అనిల్ కుమార్ మద్యం అలవాటుకు బానిసగా మారినట్లు సమాచారం. ప్రతిరోజూ అధికంగా మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్ గుంజ రేణుకనారాయణను సన్మానిస్తున్న వేముల లోకేష్ తదితరులు

హదరాబాద్, మే 6, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ సొసైటీనికి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన గుంజ రేణుక నారాయణను అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు డాక్టర్ వేముల లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్ దంపుతలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వేముల లోకేష్ మాట్లాడులూ అఖిలభారత వడ్డెర సంఘం అభివృద్ధి కృషి చేయాలని కోరారు. అలాగే వడ్డెరల సమస్యలను చైర్మన్ దృష్టి తీసుకురావాలని సంఘం ప్రతినిధులకు పిలుపునిచ్చారు. వడ్డెర యువత పెడదారిన పట్టకుండా ప్రభుత్వ పథకాలను సద్విని చేసుకోవాలని లోకేష్ కోరారు.

## భార్యాభర్తల గొడవలతో మనస్థాపం

- యువకుడు మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త

భార్యాభర్తల గొడవలతో మనస్థాపం భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన నల్లూరి సాయికుమార్ (28) వృత్తి కార్ డ్రైవర్. సుమారు ఏడు సంవత్సరాల క్రితం అనుష (25)తో సాయికుమార్‌కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (ఒక పాప, ఒక బాబు) ఉన్నారు. వివాహం జరిగిన తొలి సంవత్సరం వరకు దాంపత్య జీవితం సవ్యంగా సాగినా, అనంతరం భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. వారం రోజుల క్రితం జరిగిన గొడవ అనంతరం భార్య అనుష తన తల్లి ఇంటికి బహదూర్‌పల్లికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మే 5, 2026 రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో సాయికుమార్ తన స్నేహితుడికి వాట్సాప్ ద్వారా సందేశం పంపాడు. అనంతరం స్నేహితుడు ఇంటికి వెళ్లి చూడగా, సాయికుమార్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. ఇదివరకు కూడా సాయికుమార్ రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించగా, స్థానికులు, అతని స్నేహితుడు కాపాడినట్లు సమాచారం. భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా మనస్థాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కురుమల అభివృద్ధికి 18ఏళ్లుగా ఎనలేని కృషి

-సంఘం ప్రతిష్ట దెబ్బతీసేలా దుష్ప్రచారం సరికాదు

-రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి ఎగ్గె మల్లేశం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎగ్గెమల్లేశం, క్యామ మల్లేశ్, చీర శ్రీకాంత్, నారాయణ తదితరులు

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 18 సంవత్సరాలలో పలు ప్రధాన ఆలయాల వద్ద వసతి గృహాలు ముస్లింలను వంతెన వద్ద విద్యార్థి వసతిగృహం ఇలా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టగలిగినట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, సంఘం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మల్లేశం పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ముస్లిం జంగ్ వంతెన వద్ద ఉన్న కురుమ సంఘం భవనాన్ని సంఘానికి చెందిన ఓ నాయకుడు నేలమట్టం చేస్తే కురుమలు ఏసమావేశం నిర్వహించుకోవాలన్నా నిలువ నీడ లేకుండా పోయిందని తాను సొంతంగా 50 లక్షలు, సంఘం ద్వారా చీటీల తో 40 లక్షల పెట్టి భవన నిర్మాణం పూర్తి చేసుకోగా ప్రస్తుతం అద్దె లభిస్తుందన్నారు. 2008 సంవత్సరంలో ఆనాటి కురుమ పెద్దలు సంఘం అధ్యక్షుడిగా ఉండాలని కోరగా తాను ఎన్నికలలో పోటీ చేసి వచ్చానని దొడ్డిదారిన రాలేదన్నారు. అదే విధంగా యాదాద్రి, కొమురవెల్లి లలో దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి వసతి గృహాలను నిర్మించినట్లు తెలిపారు. మన్సూరాబాద్ లో మూడు ఎకరాల 10 గుంటల స్థలంలో 2014 సంవత్సరంలో బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అయితే పాఠశాల భవన నిర్మాణం కోసం నాటి సిఎం, మంత్రి సహకారంతో దాదాపు కోటి రూపాయలకు పైగా భవన నిర్మాణ ఫీజును మినహాయింపు తీసుకోవడం జరిగిందన్నారు.. ప్రస్తుతం ఆ భవనం నుంచి ప్రతినెల అద్దె వస్తుందని తెలిపారు. కానీ ఇవన్నీ ఏమీ తెలియని కొందరు సంఘం గురించి రకరకాలుగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కుల ప్రతిష్టను దిగ జార్చేలా వ్యవహరిస్తే కులస్తులు ఊరుకోరని ఎవరికైనా అనుమానాలు ఉంటే సంఘం కార్యాలయానికి వస్తే వారికి అన్ని చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం, చీర శ్రీకాంత్, బండారి నారాయణ, కొలుపుల నరసింహ, తూముకుంట అరుణ్ కుమార్, రెక్కల కొండల రాజ్, శ్రీనివాస్, బాలమని, విజయలక్ష్మి మిర్యాల విజయ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : భరత్ గౌడ్


సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద బిజెపి వాల్ పేయింటింగ్‌ను ప్రారంబిస్తున్న జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ తదితరులు

కంటోన్మెంట్, మే 6 ప్రభాతవార్త: గ్రేటర్‌లో బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని మహంకాలి జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్ తెలిపారు. కంటోన్మెంట్ 4వ వార్డుకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఏర్పాటు చేసిన వాల్ పేయింటింగ్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. సామాన్య కార్యకర్తలు, సిఎంలు, పీఎంలు అయిన చరిత్ర బిజెపికే ఉందన్నారు. తెలంగాణలో బిజెపికి ఎలాంటి నాయకత్వ లోపం లేదన్నారు. దేశంలో మోదీ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారన్నారు. ఇటీవల 5 రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విజయానంద్, టోపీ శంకర్, సతీష్, రాఖేశ్, శ్రావన్, అరుణ్, ప్రభాకర్, సంతోష్, విజయరామారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌కు ఎయిర్ కూలర్ల వితరణ


నిమ్స్ డైరక్టర్‌తో నవయువ నిర్మాణ సంస్థ సభ్యులు.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: నిమ్స్ ఆసుపత్రిలో రోగుల సేవార్థం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో కొనసాగే నవయువ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ కూలర్లను అందించింది. వేసవి నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఏడు ఎయిర్ కూలర్లను అందించారు. ఎమ్మెల్యే తరుపున నవయువ నిర్మాణ్ ప్రతినిధులు ఆయా కూలర్లను నిమ్స్ ఆసుపత్రి డైరక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు అందించారు. పేదలకు సాయం అందించేందుకు పెద్దమనుసుతో ముందుకొచ్చిన సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారికేల నరేష్, దినేష్, విక్రమ్ యాదవ్, మనోహర్, కార్తిక్‌లతోపాటు ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల


వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: ఈ నెల 10న ప్రధాని మోడి తెలంగాణాకు వస్తున్న నేపథ్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో బుధవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాకను ఆహ్వానిస్తూ చేపట్టిన వాల్‌రైటింగ్‌లో ఆయన పాల్గొని స్వయంగా రంగులు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా బోయ నగేష్

చార్మినార్, మే 6 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీకి చెందిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రు. తెలంగాణ రాష్ట్రంలోని పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లను బుధవారం నియమించింది. కాగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గా నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు బోయ నగేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా భాస్కర్

చార్మినార్, మే 6 ప్రభాతవార్త : పాతబస్తీ యాకుత్‌పుర నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కాగా ఎన్నో ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అల్లం భాస్కర్ మాట్లాడుతూ తనను మున్నూరు కాపు కార్పొరే షన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.. కాగా పాతబస్తీలోని ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు కార్పొరేషన్ వైస్ చైర్మన్ల పదవులు లభించాయి.

## ఈవెంట్స్ నిర్వాహకురాలికి వేధింపులు..కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: ఒక వేడుకల నిర్వాహకురాలిని మోసం చేయడమే కాకుండా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్న ఒకరిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మణికొండలో ఒక యువతి(24) ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తోంది. ఫిబ్రవరి 27న షాఫ్ట్ అకాడమీలో యాంకరింగ్ శిక్షణ కోసం వెళ్లిన సమయంలో అక్షయ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆమెకు దగ్గరైన అక్షయ్ ఆమె పుట్టినరోజున మొబైల్ ఫోన్ తీసుకుని వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు తీసుకున్నాడు. అనంతరం ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెను బెదిరించి దాదాపు రూ. 2 నుంచి 3 లక్షలు తన ఖాతాలో వేయించుకున్నాడు. వేర్వేరు నంబర్ల నుంచి ఆమెకు బెదిరిపు సందేశాలు పంపుతూ భయాందోళనలకు గురి చేశాడు. ఆమె ఇంటికి వెళ్లి మరి ఆమెను వేధించాడు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని రాఘవేంద్ర మెస్ వద్ద తన సోదరుడు, స్నేహితులతో ఉన్న సమయంలో అక్కడికి చేరుకున్న అక్షయ్, ఆమె ఫోన్ లాక్కొని చెంపదెబ్బ కొట్టడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేశాడని, బ్యాంక్ కార్డులను ఉపయోగించుకున్నాడని, మొబైల్‌ను హ్యాక్ చేసి లోకేషన్ ట్రాక్ చేశాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, సంబంధిత ఖాతాలను స్వాధీనం చేసుకోవాలని బాధితురాలు ఫిర్యాదులో కోరారు.

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

సంజీవరెడ్డి నగర్, మే 6, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలోని ఫతేనగర్ శివశంకర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అనుమానంతో భర్త భార్యను హత్య చేసిన సంఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సనత్ నగర్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లా వాసులైన చంద్ర బాను సమల్ (39), సస్మిత సమల్ (34) దంపతులు తమ ఇద్దరు పిల్లలు చందన్ (12), చందిని (9)తో కలిసి గత ఒక సంవత్సరం నుంచి శివశంకర్ కాలనీలో నివసిస్తున్నారు. మే 5, 2026 రాత్రి సుమారు 8 గంటల సమయంలో, భార్య ఇతరులతో మాట్లాడుతోందనే అనుమానంతో చంద్ర బాను ఆగ్రహానికి లోనై ఆమెపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సస్మిత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను తొలుత బీబీఆర్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ మే 6 తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఆమె మరణించింది. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ లో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలి పారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

బేగంపేట మే 6, ప్రభాతవార్త: బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఎండిఎం మాదక ద్రవ్యాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యూసఫ్ గూడా కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అవినాష్(25) డ్రగ్స్ వ్యసనానికి బానిసయ్యాడు. అవసరమైన వానికి డ్రగ్స్ కూడా సరఫరా చేసేవాడు. బేగంపేటలోని వాట్సప్ పాన్ షాప్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అవినాష్ ను బేగంపేట పోలీసులతో కలిపి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 3గ్రాముల ఎండిఎం మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అర్చన ట్రావెల్ యజమానిపై కేసు నమోదు

ముషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: టుర్లకు తీసుకువెళ్తామంటూ అనేక మంది నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్న అర్చన ట్రావెల్స్ యజమాని భోజరెడ్డిపై దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడకు చెందిన పరమేశ్వరెడ్డి(43) అనే వ్యక్తి గోవా ట్రిప్పు కోసం జస్ట్ డయల్‌లో విచారించగా, హిమాయత్‌నగర్‌లోని అర్చన ట్రావెల్స్ నుంచి ఫోన్ వచ్చింది. ఆరుగురు గోవా వెళ్లేందుకు 55వేలు అవుతుందని అర్చన ట్రావెల్స్ వారు తెలిపారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు, ఫిబ్రవరి 28వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి 55వేల రూపాయలు అర్చన ట్రావెల్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు అర్చన ట్రావెల్స్ ఏర్పాట్లు చేయకపోవటంతో ఏప్రిల్ 4వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి అర్చన ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చి, ప్రశ్నించటంతో 25 వేల రూపాయలు ట్రావెల్ యజమాని భోజిరెడ్డి చెల్లించి, మిగతా డబ్బు ఇస్తానని చెపుతూ కాలం గడుపుతూ ఉండటంతో, బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



విద్యార్థికి చేయూతనం దిస్తున్న వెంకట్ నారాయణ రెడ్డి

## ఉన్నత విద్యను అభ్యసించేందుకు దివ్యకు అండగా గోగు వెంకట్ నారాయణ రెడ్డి

-గ్రామస్తుల అభినందనలు

**కేశంపేట ,మే 6, ప్రభాత వార్త:** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన మాదారం రామచంద్రయ్య, కృష్ణమ్మ దంపతుల కుమార్తె దివ్య, పై చదువులు కొనసాగించేందుకు గ్రామానికి చెందిన గోగు వెంకట్ నారాయణ రెడ్డి ముందుకు వచ్చారు. దివ్య విద్యాభ్యాసానికి ప్రోత్సాహం కల్పిస్తూ రూ. 10 వేలు నగదును ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థిని దివ్య తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు వెంకట్ నారాయణ రెడ్డి చేసిన ఈ సహాయాన్ని అభినందిస్తూ, ఆయన సేవా భావాన్ని కొనియాడారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇలాంటి సహాయాలు మరింత మంది విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఇలాంటి సేవాభావం కలిగిన వెంకట్ నారాయణ రెడ్డిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేత

**కేశంపేట ,మే 6, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన బుర్ర భాగ్యమ్మకు బుధవారం స్థానిక తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి కేశంపేట మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి ్మ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సయ్యద్ సలీం పురుషోత్తం లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కు అందజేస్తున్న తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి

## నేడు ప్రగతి ప్రణాళికపై అవగాహన

**జిల్లెడు చౌదరి గూడెం, మే 6 ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన ప్రగతిప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాజేందర్రెడ్డి విద్యుత్ ఏఈ నరసింహులు బుధవారం తెలిపారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ, సౌర విద్యుత్ కేంద్రాలు పిఎం కిసాన్‌పై అవగాహన కల్పించనున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్లు ఉపసర్పంచులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పేదల నడ్డి విడుస్తున్న మోడీ

**వికాసిత్ భారత్ అంటే ధరలు మీద ధరలు పెంచడమేనా**

**మొయినాబాద్, మే 6, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలం సిపిఐ కార్యదర్శి కే శ్రీనివాసు ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్ అధ్యక్షతన నిరసన కార్యక్రమంలో చేపట్టడం జరిగింది కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్యాస్ ధరలు పెట్రోల్ ధరలు ధరలను డీజిల్ ధరలను విపరీతంగా పెంచే పెద్ద పేద ప్రజలను నడ్డి విడుస్తున్నాడని వికాసిత్ భారత అంటే ధరల మీద ధరలు పెంచడం అని మండిపడ్డారు. మోడీ వచ్చినా తర్వాత దేశంలో పేదరికం పెరిగిందని నిరుద్యోగం పెరిగిందని ప్రజల యొక్క తలసరి ఆదాయం తగ్గిపోయిందని దుయ్యబట్టారు. రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని రైతు కూలీలకు కార్మికులకు కర్షకులకు కనీస వేతనాలు లేక ఒకపక్క అల్లాడిపోతుంటే కుటుంబ భారం మోయలేక అన్యాయం రామచంద్రాన్ని అని బాధపడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం ధరల మీద ధరలు పెంచే పేద ప్రజల నడ్డి విడుస్తుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలును వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సురంగల్ మల్లేష్ ఉప్పరి సురేష్ కాసిం భాయ్ బాలమణి పెద్ద మంగళారం పాండు వడ్ల రాములు మల్లమ్మ పెంటమ్మ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## డబుల్‌బెడ్‌రూమ్స్‌లలో జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

**కుత్బుల్లాపూర్, మే 6 ప్రభాతవార్త**

గాజులరామారం సర్కిల్ కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసుల సమస్యలపై కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్(ఐఎఎస్) అకస్మికంగా పర్యటించారు. బుధవారం కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్స్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యసత్వర పరిష్కార చర్యలను చేపట్టాలని ఆయన సంబందిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఆయనకు స్థానిక 2బిహెచ్‌కె డిగ్నిటీ హౌసింగ్‌ప్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీ సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చిన ఫిర్యాదులకు గాజులరా మారం సర్కిల్ ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్,టౌన్‌ప్లానింగ్ అధికారి సుమిత్రభాయ్‌లతో కలిసి పర్యటించి సమస్యలను పరిశీ లించారు.. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు ఆయన స్పందిం చారు. ఈసందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లు టెర్రస్‌వర్క్, నీళ్లబోర్‌కోసం, పిల్లల పార్కుకాంపౌడ్‌గోడ నిర్మా ణం, ఎస్.టి.పి వాటర్ అవుట్‌లెట్ తదితర సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టనున్నట్లు వారికి హామీఇచ్చారు. సొసైటీ ముఖ్య సలహాదారులు షేక్ సాజిద్‌చౌష్; ఎండి.అతిక్‌రెహామాన్, చైర్మెన్ సాధుల వేణు, వైస్‌చైర్మెన్ బ్రహ్మనాయుడు, ప్రధానకార్యదర్శి మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సయ్యద్ షఫీ, శ్రీనివాస్, కోశాధి కారి ఖయ్యూంల ఆధ్వర్యంలో జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్‌ను కలిసారు. తాము గతంలోనూ ప్రజావాణిలో కైసర్‌నగర్ డబుల్‌బె డ్‌రూమ్‌ల నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా జోనల్‌కమిషనర్ పింకేశ్‌కు మార్ మాట్లాడుతూ సత్వరం గాజులరామారం కైసర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్‌ల నివాసితులు ఎర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత వివిధ విభాగాల అధికారులతో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీఇచ్చారు.



కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్(ఐఎఎస్)కు వినతిపత్రం సమర్పిస్తున్న కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసులు

### శ్రీవారి ఆలయ పునఃనిర్మాణానికి

# ప్రారంభమైన పూజలు

## టిటిడి అర్చక బృందంచే శ్రీవైఖానస ఆగమశాస్త్రోక్తంగా పూజలు

**కొడంగల్,మే 6,ప్రభాతవార్త:**తెలంగాణాలో మినీ తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలు బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు,మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో పనులు కొనసాగాయి

.మొదటిరోజు కావడంతో భగవత్ ప్రార్ధన, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన,వాస్తు మండలపూజ ,పూర్ణహుతి, హలయుగలాంగల పూజాకర్షణ వైదిక కార్యక్రమాలు టీటీడీ అర్చక బృంధంచే శ్రీవైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం మొదటి రోజు వైభవంగా నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఎద్దులతో కలిసి నాగలి దున్నటం,విత్తనాలు వేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ,పురజనులు,భక్తులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి నాగలితోదున్ని భూమిపూజ చేసిన అర్చకులు,పుర చైర్మేన్

# అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట

**పూడూరు, మే 6, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని రేగడి మామిడిపల్లి గ్రామంలో బుధవారం నాభిశిల (బొడ్రాయి),నాగుల నూతన విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు అంగరంగవైభవంగా జరిగాయి.హనుమాన్ మందిరం లో యజ్ఞాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుప్రభాతసేవ, యంత్రాభిషేకము,వాస్తు పర్యగ్రీకరణ, జల తర్పణములు, గర్తన్యాసములు,రత్నన్యాసం ,ధాతున్యాసం, యంత్రస్థాపన,బింబప్రతిష్టలు,కళాన్యాసము,ప్రాణప్రతిష్ట,నేత్రోన్మీల న,కుంభదర్పణం,దేనుదర్శనం, జపాదులు, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, మహాదాశీర్వచనం ,మండపోద్వాసన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు వేదపండితుల మంత్రోత్స రణల మధ్య జరిగాయి.ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి రాంమోహన్ రెడ్డి,గ్రామ సర్పంచ్ చుక్కన్నగారి భూపతిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని మ్రొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆయల పూజారులు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా,ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.ఖానాపూర్,దేవరంపల్లి,దామరగిద్ద,రేగడి మామిడిపల్లి తదితర గ్రామాల భజనమండలీలు పాల్గొని రాకంచెర్ల శ్రీవెంకటదాసులవారి సంకీర్తనలు ఆలాపించారు.దీంతో గ్రామం అంతా రామనామ స్మరణతో మార్మోగింది.



పూడూరు మండలం రేగడి మామిడిపల్లి గ్రామ హనుమాన్ మందిరంలో యజ్ఞాలు చేస్తున్న సర్పంచ్ భూపతిరెడ్డి,భక్తులు తదితరులు

# మోడీ సభను జయప్రదం చేద్దాం

**చేవెళ్ల, మే 6, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న నిర్వహించే తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు కె.ఎస్. రత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి మరియు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన చేవెళ్లలో భాజపా నాయకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కీలక వేదికగా ఈ సభ నిలవనుందని పేర్కొన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ సభ మంచి అవకాశం అని చెప్పారు.చేవెళ్ల నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం ప్రతి గ్రామం, మండల స్థాయిలో సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని పార్టీ నాయకులకు సూచించారు.ఈ సమావేశంలో భాజపా నాయకులు మోహన్ రెడ్డి డాక్టర్ వైభవ్ రెడ్డి వెంకట్ రెడ్డి మాణిక్య రెడ్డి అశోక్ పత్తి సత్యనారాయణ కరికే శ్రీనివాస్ చీర శ్రీనివాస్ కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డి అభి శేఖర్ రెడ్డి జైపాల్ రెడ్డి రిషికేశ్ ఉమాశంకర్ రెడ్డి బాల్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కృష్ణ విఠల్ రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలం పువ్వు గుర్తు గోడలపై వేస్తున్న బిజెపి నాయకులు



## రంగారెడ్డి జిల్లా సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎన్నిక



**తలకొండపల్లి మే 6,ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లాలో నూతనంగా సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా లోని కందుకూరు కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో(సివిఎంసి) కమిటీ కన్వీనర్‌గా బోడ కృష్ణకో కన్వీనర్ గా డి.శంకర్ ఆమనగల్ బ్లాక్ జర్నలిస్టుల సంఘం ప్రెసిడెంట్, కంబాలపల్లి. సంతోష, శివ గళ్ళ దేవమ్మ, దామోదర్ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈసందర్భంగా డి బి స్ యూ రాష్ట్ర అధ్యక్షులు గందు నరసింహ,పూలే,అంబేద్కర్ జ్ఞాన గ్రంథాలయ వ్యవస్థాపకులు జి సుధాకారులు ముఖ్య అతిథులుగా హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గిరిజన ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, విలేకరులు, న్యాయవాదులు. సిటిజన్స్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో సభ్యులుగా ఉండాలన్నారు. కందుకూరు మండల కేంద్రంలో కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గందు నరసింహ . హైకోర్టు అడ్వకేట్ దివ్యశ్రీ , అంబేద్కర్ జాతర ఫౌండర్ జి సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమము జిల్లా కోఆర్డినేటర్ డి బి ఎస్ యు కార్యదర్శి జోగు ర వే ఎ ష్ అ ధ ్ య క్ష త న నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గందు. నరసింహ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల షెడ్యూల్ తెగలపై అత్యాచారాల నిరోధక చట్టం 1989 రూల్స్ ప్రకారం1995లో పొందుపరిచిన అత్యాచారాల నిర్మూలనకై మరియు బాధితులు సాక్షుల హక్కుల పరిరక్షణ రూల్ నెంబర్ 17(1) ప్రకారం జిల్లా స్థాయినిగా మరియు పర్యవేక్షణ కమిటీలు పూర్తిగా విఫలమవుతున్నట్లు వివిధ నివేదికలో రుజువు చేస్తున్నాయన్నారు. ఈ కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే పౌర సంస్థల సహకారంతో ఈ కమిటీలను ఏర్పాటు చేసి అట్రాసిటీ చట్టం అమలు చేయుటకు శిక్షణ ఇచ్చి చట్టం అమల్లో పూర్తి భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు మహిళా సంఘాల నాయకురాలు సంఘ సభ్యులు నరసింహ శేఖర్ యాదయ్య భగవంతు బాలమని కుమార్ సంతోష్ తాండ్ర యాదయ్య గోరేటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదబాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**షాబాద్,మే 6, ప్రభాతవార్త :** నిరుపేద ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన మంగలి మహేష్ గత సంవత్సరం పరిగి సమీపంలో జరిగిన పెళ్లి బస్సు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడగా, బాధితుడికి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స, శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.1,25,000/ విలువైన (ప్రొసీడింగ్ కాపీ) పత్రాన్ని బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి తో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహేష్ బాబాయి మంగలి రామస్వామికి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ వారి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం తోడ్పడుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ, సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బైకును ఢీకొన్న లారీ ...మహిళ మృతి

**తలకొండపల్లి మే 6 ,ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో బైక్‌పై వస్తున్న ఇద్దరిని వేగంగా వస్తున్న లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. అందుకు సంబంధించిన వివరాల ప్రకారం తలకొండపల్లి మండల పరిధి లోని లింగ రావు పల్లి గ్రామానికి చెందిన బకి జంగమ్మ(50), అనే మహిళ బుధవారం నాడు తన కుమారుడు, అల్లునితో కలిసి బైక్ నెంబర్ 070554పై తలకొండపల్లికి వస్తు న్నారు. అదే సమయం లో తలకొండపల్లి నుంచి ఎదురుగా వస్తున్న లారీ స్థానిక కాటన్ మిల్ సమీపంలో వేగంగా వస్తూ బైకును ఢీకొంది. దాంతో బైక్ పై వస్తున్న జంగమ్మ అక్కడికక్కడే మృతిచెందడంతో అల్లునికి తీవ్ర గాయా లయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సిఐ జానకిరామ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని యాక్సిడెంటుకు గురైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతివేగంతో నడిపిన లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన గడ్డమల్లయ్య గూడ సర్పంచ్



కాంగ్రెస్ పార్టీలో చేరిన గడ్డ మల్లయ్య గూడ సర్పంచ్ మంగ జంగయ్య

**యాచారం,మే6, ప్రభాత వార్త:**

యాచారం మండల పరిధిలోని గడ్డ మల్లయ్యగూడ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే స్వయంగా కండువాకప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా అచ్చన జంగయ్య మాట్లాడుతూ గత 5 సంవత్సరాల కాలంలో గ్రామ అభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వం నుంచి కేవలం రూ. 23 లక్షలు మాత్రమే నిధుల మంజూరు జరిగిందని,గ్రామంలో యూత్‌భవనం, డ్రైనేజీవ్యవస్థ, గ్రంథాలయం వంటి కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో గ్రామాలను పూర్తిగా నిరక్ష ్యం చేశారని,కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. సర్పంచ్ మంగ జంగయ్య చేరికతో గడ్డమల్లయ్య గూడ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. యూత్ భవనం, డ్రైనేజీ, లైబ్రరీ సమస్యలను త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. జంగయ్య లాంటి అనుభవజ్ఞులైన నాయకులు పార్టీలోకి రావడం శుభపరిణామం అని ఎమ్మెల్యే పేర్కొ న్నారు. టీజీఐఐసి ద్వారా రూ. 45 లక్షలు నిధులు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశారు.రూ. 15 లక్షలు సిసి రోడ్లు , 30 లక్షలు అండర్ డ్రైనేజీకి వాడుతామని సర్పంచ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు యార జంగయ్య , గండికోట శ్రీరాములు , గౌర రాములు , వారికుప్పల మమత , ఆర్ల జంగ య్య , ఆవబీరప్ప , బొడ్డు శ్రీశైలం , ఇక్క శివాని , గ్రామస్థులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి , మాజీ జడ్పీటీసీ రాచర్ల వెంకటేశ్వర్లు , మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ , పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ, బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్ర శేఖర్ రెడ్డి , మూడేడ్ల వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే టి రాంమోహన్‌రెడ్డి**

**పూడూరు, మే 6, ప్రభాతవార్త :** దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీటవేస్తుందని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామంలో శ్రీశివాలయం 24వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే,పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శివాలయం ప్రాంగణంలో ఎస్‌డిఎఫ్ కింద మంజూరి అయిన రూ.10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనకోసం ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు.

గ్రామస్తుల విన్నపం మేరకు ఆలయం ప్రాంగణంలో బండలు వేసేందుకు రూ.5లక్షల నిధులను మంజూరీ చేస్తానని,ఆలయంలో మంచినీటి కొరత తీర్చేందుకు బోరుబావిని వేయిస్తానని హామీ ఇచ్చారు.తొలుత శివాలయంలో వేదపండితుల మంత్రోత్స రణలు, బాజాభజంత్రీల మధ్య శివపార్వతుల కళ్యాణం జరిగింది.ఈ సందర్భంగా వివిధ గ్రామాల భక్తులు భారీసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల భజన మండలీలు పాల్గొని రాకమచెర్ల శ్రీ వెంకటదాసులవారి సంకీర్తనలు ఆలాపించారు.హాజరైన భక్తులు ఆలయ పూజారులు తీర్ధ ప్రసాదాలు అందజేయగా,కాట్న జంగయ్య కుటుంబీకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిద్ధన్నగారి యాదవరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్‌లు రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్,వివిధ పార్టీల నాయకులు అమర్‌నాథ్,శకీల్,లక్కం సత్యనారాయణ, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం అంగడి చిట్టంపల్లిలో శివపార్వతుల కళ్యాణం జరుగుతున్న దృశ్యం



పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి శివాలయంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి తదితరులు

## బాధితులకు పోగొట్టుకున్న ఫోన్లు అందజేసిన దౌల్తాబాద్ ఎస్సై

**దౌల్తాబాద్,మే 6,ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారంరోజు ఎస్సై వేణుకుమార్ రికవరీ చేసిన పోగు ట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు.ఈ సంధర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సలీంపూర్ గ్రామానికి చెందిన మల్లేష్,ఈర్లపల్లికి చెందిన నాయకోటి బందెప్ప గతంలో తమ ఫోన్లు పోగొట్టు కోగా,పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా వాటిని ట్రేస్ చేసి రికవరీ చేసి అంజేశారు.ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే పోలీసులకు ఫిర్యాధు చేయాలని ఈ సంధర్భంగా ఎస్సై సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్సై

## రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీరామ్‌చక్రవర్తి నియామకం పట్ల హర్షం

**శామీర్‌పేట, మే 6, ప్రభాతవార్త:**

రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా శ్రీరామ్‌చక్రవర్తి నియమితులు కావటం పట్ల మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి మున్నూ రు కాపు కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా శ్రీరా మ్ చక్రవర్తిని నియమిస్తూ ప్రకటించటం చారిత్రాత్మకమని అన్నారు. శ్రీరా మ్ చక్రవర్తి నాయకత్వంలో మున్నూరు కాపు సంఘం సమా జం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షి స్తున్నట్లు తెలిపారు. కార్పొరేష్ చైర్మన్‌గా శ్రీరామ్‌చక్రవర్తి నియ మితులైనందున ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్‌రావు తెలియజేశారు.



మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్‌రావు